# గరీబోళ్ల గుండెల్లో..

**బీఆర్ఎస్ జోష్‌కు తోడైన పీజేఆర్ చరిష్మా**

# నాడు పీజేఆర్.. నేడు కేసీఆర్



సిటీబ్యూరో/బంజారాహిల్స్, నవంబర్ 1 ( నమస్తే తెలంగాణ ) : నాడు పీజేఆర్.. గరీబోళ్లను గుండెల్లో పెట్టుకుని వారి సంతోషానికి కారణమయ్యాడు. నేడు పీజేఆర్‌ను గుండెల్లో పెట్టుకున్న కాంగ్రెస్ అభిమానులంతా పీజేఆర్ వారసుడి కోసం బీఆర్ఎస్‌లో భారీగా చేరుతున్నారు. పీజేఆర్ పేరును నగరం నుంచి విడదీయాలని కుట్రలు పన్నిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పడానికి పీజేఆర్ వెంట నడిచిన కాంగ్రెస్ శ్రేణులు సీఎం కేసీఆర్ బాట పట్టారు. దీంతో పీజేఆర్ చరిష్మా ఇప్పుడు బీఆర్ఎస్‌కు తోడు కావడంతో గ్రేటర్‌లో గులాబీ దళం మరింత దూకుడు పెంచింది. తమను అక్కున చేర్చుకున్న కేసీఆర్‌కు బీఆర్ఎస్‌ను గెలిపించి రుణం తీర్చుకుంటామని పీజేఆర్ అభిమానులు ప్రతిన బూనారు. పీజేఆర్ ఆశయాలన్నీ పేద ప్రజల కోసమే ఉండేవనీ.. ఆయన పేదోళ్లకు ఏదైతే మంచి చేయాలని కలగన్నాడో.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అవన్నీ సాధ్యమయ్యాయని కేసీఆర్ సేవలను కొనియాడుతున్నారు. బీఆర్ఎస్‌లోకి రావడం పీజేఆర్‌తో కలిసి పనిచేసినట్టుగానే ఉందని ఆనాటి పీజేఆర్ వెంట ఉన్న నాయకులు చెబుతున్నారు. మొత్తంగా పీజేఆర్ అభిమానులు, బీఆర్ఎస్ కార్యకర్తలు కలిసిన సందర్భం.. కాంగ్రెస్ పార్టీ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెట్టిస్తున్నది.

## పేదల సంతోషమే ముఖ్యం..

ఆనాటి పీజేఆర్ ఆశయాలు తెలంగాణ ప్రభుత్వంలో నెరవేరాయి. గరీబోళ్లకు నీడ కల్పించాలని, తాగునీరు అందించాలని, వారి ఆరోగ్యం కోసం సరైన ఆసుపత్రులు నిర్మించాలని.. నాణ్యమైన విద్యుత్తు అందించాలని పీజేఆర్ కలగనేవాడు. అణగారిన వర్గాలకు అండగా ఉండాలని కోరుకునే పీజేఆర్‌కు సొంత పార్టీలోనూ అవమానాలు ఎదురయ్యాయి. అధికారంలో ఉన్నప్పటికీ చేదు అనుభవాలే ఎదురయ్యాయి. వాటిని పట్టించుకోకుండా గరీబోళ్ల కోసం ఎంతకైనా తెగించే వ్యక్తిగా ఆయన సేవలు అందించాడు. అయితే ఆనాటి పీజేఆర్ ఆశయాలన్నీ తెలంగాణ ప్రభుత్వంలో సాకరమవడం గొప్ప విషయమని పీజేఆర్ అభిమానులంతా చెబుతున్నారు. అత్యాధునిక హంగులతో డబుల్ బెడ్రూమ్‌ల నిర్మాణం, తాగునీరు, నిరంతర విద్యుత్తు, బస్తీ దవాఖానలు, కేసీఆర్ కిట్స్, పింఛన్లు ఇలా అనేకమైన సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి సీఎం కేసీఆర్ దేశానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడుతున్నారు. అందుకే బీఆర్ఎస్ పార్టీలోకి రావడం పీజేఆర్‌తో కలిసి పనిచేసిన అనుభూతినిస్తుందని చెబుతున్నారు.

## గులాబీ జోరు..!!

దశాబ్దాలపాటు కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన నాయకులను పక్కన పెట్టి ప్యారాచూట్ నేతలకు టికెట్లు అమ్ముకున్నారని రేవంత్ రెడ్డిపై ఆరోపణలు వెల్లువెత్తుతుండటంతో వారంతా బీఆర్ఎస్ పార్టీలోనే న్యాయం జరుగుతుందని నమ్ముతున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నగరంలోనే కాకుండా తెలంగాణ మొత్తంలో అత్యంత ప్రజాదరణ కలిగిన నేతగా మూడు దశాబ్దాలకు పైగా సేవలందించిన దివంగత మాజీ మంత్రి, తెలంగాణ ముద్దుబిడ్డ పీజేఆర్ అనుచరులంతా గులాబీ కండువాలు కప్పుకుంటున్నారు. ఉమ్మడి ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లోని పీజేఆర్ అభిమానులు సంతోషం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పీజేఆర్‌తో కలిసి పనిచేసిన సీనియర్ నేతలు సురేందర్‌యాదవ్, ఖదీర్, యాదగిరియాదవ్ లాంటి పలువురు నాయకులు విష్ణుతో పాటు బీఆర్ఎస్‌లోకి రావడం విశేషం.

- మట్టి మనిషి చరిత్ర తుడిచెయ్యడానికి కాంగ్రెస్ కుట్ర
- విష్ణు చేరికతో అనేక నియోజకవర్గాల్లో గులాబీకి జై కొడుతున్న కాంగ్రెస్ శ్రేణులు

## బస్తీవాసుల్లో అపార అభిమానం

హైదరాబాద్‌కు కృష్ణా జలాల తరలింపు, పోతిరెడ్డి హెడ్ రెగ్యులేటర్ ఎత్తు పెంపు తదితర అంశాల్లో సొంతపార్టీ ప్రభుత్వంతో పీజేఆర్ పోరాటం చేశారు. అసెంబ్లీ నుంచి ప్రారంభమైతే బీహెచ్‌ఈఎల్ దాకా, షేక్‌పేటలో ప్రారంభమైతే అల్వాల్ దాకా గతంలో ఖైరతాబాద్ నియోజకవర్గం విస్తరించి ఉండేది. ఫిలింనగర్‌లో 18 బస్తీలు, బంజారాహిల్స్ ప్రాంతంలోని అనేక బస్తీలు పీజేఆర్ హయాంలోనే ఏర్పడ్డాయి. మియాపూర్ సమీపంలోని హఫీజ్‌పేట, బోరబండ, కార్మికనగర్, రహ్మత్‌నగర్‌లోని పలు బస్తీలు పీజేఆర్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఏర్పడ్డాయని స్థానికులు ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు. కూకట్‌పల్లి నుంచి బాలానగర్ దాకా ఉన్న ప్రాంతంలో కూడా పీజేఆర్ చరిష్మా ఉంది. ఇప్పటికే ఈ ప్రాంతాల్లో బీఆర్ఎస్ బలమైన శక్తిగా ఉంది. ఉమ్మడి ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి ఏర్పడిన అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నారు. కాగా తాజా పరిణామాలతో పీజేఆర్ కుటుంబాన్ని దెబ్బతీసేందుకు పీసీసీ అధ్యక్షుడు చేసిన కుట్రలతో ఆయా నియోజకవర్గాల్లోని పీజేఆర్ అనుచరులు, అభిమానులు సైతం బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. ఈ ఎన్నికల్లో ఉమ్మడి ఖైరతాబాద్ నియోజకవర్గంలోని బస్తీల్లో పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్ రెడ్డితో ప్రచారం చేయించాలనే ఆలోచనలో కూడా బీఆర్ఎస్ పార్టీ నేతలు ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద రేవంత్‌రెడ్డి చేస్తున్న కుట్రలు నగరంలో ఇప్పటికే అంతంత మాత్రంగా ఉన్న కాంగ్రెస్ పార్టీని మరింత బలహీనంగా మార్చినట్లయిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

## 'రేవంత్‌ను రైతులు నిలదీయాలి'

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): రైతుబంధు పథకాన్ని భిక్షం అంటూ మాట్లాడి అన్నదాతలను అవమానించిన పీసీసీ చీఫ్ రేవంత్‌ను ఊరూరా రైతులు నిలదీయాలని రెడ్కో చైర్మన్ వై.సతీశ్‌రెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఓట్లడగడానికి వస్తున్న ఆయన, ఆ పార్టీ ఢిల్లీ నేతలు, గల్లీ నాయకులు గ్రామాల్లో రైతులను అవమానిస్తే గల్లా పట్టి నిలదీసి చెర్నకోలతో కొట్టినా తప్పులేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ రైతు వ్యతిరేక పార్టీ అని రేవంత్ మాటలతో మరోసారి స్పష్టమైందని తెలిపారు. మొదటి నుంచి రేవంత్‌కు రైతులంటే చిన్నచూపేనని, ఆయనకు ప్రజలు తగిన శాస్తి చేస్తారని తెలిపారు. తన తప్పును తెలుసుకొని రేవంత్ వెంటనే రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఖబర్దార్ రేవంత్..

- రేవంత్ నోట దురహంకార వ్యాఖ్యలు
- భగ్గుమన్న ఓయూ విద్యార్థి లోకం
- బహిరంగ క్షమాపణలకు డిమాండ్

సిటీబ్యూరో, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ)/తార్నాక: ఒడ్డుకు చేరేదాకా ఓడ మల్లన్న... ఆ తర్వాత బోడ మల్లన్న! అనేది సామెత. కానీ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాత్రం ఒడ్డుకు చేరకముందే బోడ మల్లన్న అంటున్నారు. సాధారణంగా తనలోని నైజం బయటికి తన్నుకొస్తుండటంతో ఆయన నోటి నుంచి దురహంకార వ్యాఖ్యలు జాలువారుతున్నాయి. పది మందికి అన్నం పెట్టే రైతన్నను బిచ్చగాళ్లతో పోల్చి అవహేళన చేసిన ఆ నోరు.. విద్యార్థి లోకాన్ని కూడా వదల్లేదు. ఓయూ విద్యార్థులపై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఓ సందర్భంలో రేవంత్‌రెడ్డి ఉస్మానియా విద్యార్థులను ఉద్దేశించి... 'చిల్లర ఖర్చులకు తెచ్చుకొని... పక్కనే ఉన్న తార్నాకలో ఉన్న బార్లకు పోయి బీర్లు తాగి ఉంటరు. బీర్లు తాగి, బిర్యానీ తిన్నంక అది అరిగే వరకు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మాట్లాడి ఉంటరు. వాళ్లదేం ఉంటది... అడ్డమీది కూలోళ్లు...' అని వ్యాఖ్యానించడంపై ఉస్మానియా విద్యార్థులు భగ్గుమన్నారు.

### రేవంత్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు స్పందించాలి



రేవంత్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు ఇప్పటికైనా స్పందించాలి. విద్యార్థి, యువకులను రేవంత్‌రెడ్డి అవమానించడం సరికాదు. ఓయూలో చిల్లరగాళ్లు, అడ్డమీది కూలోళ్లు ఉన్నప్పుడు ఇక్కడికి వచ్చి సభల్లో ప్రసంగించాలనే ఆతృత ఎందుకు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీని పట్టుకుని వేలాడుతున్న వారు పునరాలోచించుకోవాలి. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నాం.

– నరేశ్, పీజీ విద్యార్థి

### అగ్రకుల అహంకారంతోనే వ్యాఖ్యలు



రేవంత్‌రెడ్డి అగ్రకుల దురహంకారంతో ఓయూ విద్యార్థులను అవమానించిన తీరు గర్హనీయం. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మాట్లాడినంత మాత్రాన అడ్డమీది కూలీలతో పోల్చడం సరికాదు. రేవంత్‌కు దమ్ముంటే ఓయూ క్యాంపస్‌లో సీటు సాధించి, అప్పుడు మాట్లాడాలి. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే పోటీపరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచినవారికే ఓయూలో సీటు లభిస్తుంది. అది కూడా తెలియకుండా జాతీయ పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడు ఎలా అయ్యాడో దేవుడికే తెలియాలి. తనలాగే అందరూ బీరు, బిర్యానీలకు అమ్ముడు పోతారని అనుకోవడం ఆయన భ్రమ.

–గౌతం ప్రసాద్, పీజీ విద్యార్థి

## ఎంపీ ప్రభాకర్ రెడ్డిపై జరిగిన దాడి హేయం



పూలవ్యాపారిని ఓటు అభ్యర్థిస్తున్న పద్మారావు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 01 : ఎంపీ ప్రభాకర్ రెడ్డిపై జరిగిన దాడి హేయమైన చర్య అని డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావుగౌడ్ ఖండించారు. సికింద్రాబాద్ నియోజకవర్గం బౌద్ధనగర్ డివిజన్‌లోని వివిధ కాలనీలు, బస్తీల్లో బుధవారం విస్తృతంగా ప్రచారం చేశారు. డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డితో కలిసి పాదయాత్ర నిర్వహించి, ఓటర్లను కలిసి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. దుబ్బాక అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి పై జరిగిన దాడి హేయమైన చర్య అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో హింసకు తావులేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ హింస రాజకీయాలకు వ్యతిరేకమని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో తాము క్రియాశీలకంగా వ్యవహరించామని, కానీ ఏనాడూ గాంధేయ మార్గాన్ని వీడలేదని గుర్తు చేశారు.

## బీఆర్ఎస్‌ను గెలిపించండి



చిక్కడపల్లిలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్

ముషీరాబాద్, నవంబర్ 1: నియోజకవర్గంలో అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్ పార్టీని ఆశీర్వదించాలని ముషీరాబాద్ అభ్యర్థి, ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో గతంలో ఎన్నడూ లేనంతగా తెలంగాణ అభివృద్ధి చెందిందన్నారు. బుధవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి గాంధీనగర్ డివిజన్ వివేక్‌నగర్, అశోక్‌నగర్, జవహర్‌నగర్, ఎస్ఆర్‌టీ క్వార్టర్స్, బాపూనగర్ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. నిత్యం మీ మధ్యే ఉండి బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి చేసిన తనకు మరో అవకాశం కల్పించాలని కోరారు. గతంలో ఏ ఎమ్మెల్యే చేయనంత అభివృద్ధి పనులు చేశానన్నారు. ప్రజల మధ్య ఉండి పని చేసేటోళ్లకు ఓట్లు వేయాలని, చుట్టపు చూపుగా వచ్చిపోయే నేతలను నమ్మవద్దన్నారు. గత ఐదేళ్లలో నియోజకవర్గంలో వెయ్యి కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేశానని, ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. కాగా..బాగ్‌లింగంపల్లికి చెందిన యువకులు, మహిళలు 100 మంది ఎమ్మెల్యే సమక్షంలో బీర్ఎస్ పార్టీలో చేరారు.

## కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ జెండా ఎగిరేస్తాం



మూడో వార్డు మడ్‌ఫోర్డ్‌లో ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత

కంటోన్మెంట్, నవంబర్ 1 : నియోజకవర్గంలో మరోసారి బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత అన్నారు. కంటోన్మెంట్‌లోని మూడో వార్డులో బుధవారం ప్రచారంలో భాగంగా రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ ఎన్నికల అదనపు ఇన్‌చార్జి గజ్జెల నాగేశ్, బోర్డు మాజీ సభ్యురాలు అనితా ప్రభాకర్‌తో కలిసి ఇంటింటికీ తిరిగి అభ్యర్థి లాస్యనందిత ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... విపక్ష పార్టీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. అభివృద్ధి యజ్ఞం ఇలాగే కొనసాగాలంటే బీఆర్ఎస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ తిరుగుతూ వివరించారు. ప్రచారంలో బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత, పార్టీ నాయకులు అనిల్, పరశురాం, చిన్న, సూరి, శేఖర్, అశోక్, నవీన్, సాదిక్, ప్రకాశ్, శంకర్, మహేశ్, బాలరాజ్, సునీల్, రాకేశ్, గోపాల్, త్యాగరాజు, సంధ్య, సబిత, స్వప్న, గాయత్రి, పోచమ్మ, రేణుక, ఐలమ్మ, ప్రమీల, అంజిబాయితో పాటు ఉద్యమకారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.